# ఖరారు కాని.. జీహెచ్‌ఎంసీ బడ్జెట్!

- స్టాండింగ్ కమిటీ తిరస్కరించి పది రోజులు గడిచినా సవరించని ప్రతిపాదనలు
- ఈ వారంలో కమిటీ ముందుకు రావడం కష్టమే..
- జాప్యానికి ఫైనాన్స్ విభాగం అధికారుల నిర్లక్ష్యమే అసలు కారణం




సిటీబ్యూరో, డిసెంబర్ 8(నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీ 2025-26 ముసాయిదా బడ్జెట్ ఖరారు మరింత ఆలస్యం కానుంది. అక్టోబరులోనే బడ్జెట్ ప్రతిపాదనను ఆమోదం పొందాల్సి ఉన్నప్పటికీ నేటికీ ప్రతిపాదన కసరత్తు దశలోనే ఉంది. మొదటి వారంలో అన్ని శాఖల ముఖ్య అధికారుల నుంచి బడ్జెట్ ప్రతిపాదనలు తీసుకుని సవరణ చేసిన బడ్జెట్‌ను స్టాండింగ్ కమిటీ ముందుకు తీసుకురావాలని మేయర్ గద్వాల విజయలక్ష్మి ఆదేశాలు జారీ చేశారు. రూ.8,340 కోట్లతో వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ప్రతిపాదనలపై గత నెల 30వ తేదీన మేయర్ అధ్యక్షతన జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆదాయ మార్గాలను తక్కువ చూపడంపై సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. గడిచిన మూడేళ్లలో ఆదాయ రాబడిలో అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

ప్రకటన విభాగం, ఎస్టేట్ విభాగం, ఆస్తిపన్ను, టౌన్ ప్లానింగ్, ట్రేడ్ లైసెన్స్‌లలో లోపాలను ఎత్తిచూపి బడ్జెట్ సవరణలు చేసి తుది బడ్జెట్‌ను ఖరారు చేయాలని మేయర్ ఆదేశించారు. ఇది గడిచి పది రోజులైనా బడ్జెట్ ఫైనల్ చేయలేదు. అధికారులు తలోదారి అన్నట్లుగా ఉండటం, ఫైనాన్స్ విభాగం అధికారుల నిర్లక్ష్యం వెరసి బడ్జెట్ ప్రతిపాదన మరింత ఆలస్యానికి కారణమైంది. ప్రజా విజయోత్సవాలలో కమిషనర్ బిజీగా ఉండటంతో సమీక్షించిన దాఖలాలు లేవు. అంతే కాకుండా దీనికి తోడు అసెంబ్లీ సమావేశాలు నేటి నుంచి మొదలు కావడంతో ఈ వారంలో జరగాల్సిన స్టాండింగ్ కమిటీ సమావేశం జరగడం అనుమానంగానే ఉంది. దీంతో మరో పది రోజుల పాటు బడ్జెట్‌పై సమయం తీసుకునే అవకాశాలు కనబడుతున్నాయి.

### అక్టోబరు నెలలోనే మొదలు పెట్టాల్సింది..

*వాస్తవానికి అక్టోబరు నెలలోనే బడ్జెట్‌కి సంబంధించిన ప్రక్రియ మొదలు పెట్టాల్సి ఉన్నప్పటికీ.., డిసెంబర్ రెండో వారం వరకు సమయం తీసుకున్నారు. జీహెచ్‌ఎంసీ చట్టం -1955 ప్రకారం, కార్పొరేషన్ బడ్జెట్ అంచనాలను గత నెలలో బడ్జెట్ అంచనాలు, ప్రతిపాదనలపై కమిషనర్ నుంచి వివరణాత్మక సమాచారం స్టాండింగ్ కమిటీ ముందుకు రావాల్సి ఉంది. డిసెంబర్ 15వ తేదీలోపు వార్షిక బడ్జెట్ అంచనాలు స్టాండింగ్ కమిటీ ఆమోదించాలని చట్టం పేర్కొంటుంది. వచ్చే ఏడాది జనవరి 10వ తేదీలోపు జనరల్ బాడి మీటింగ్‌లో సభ్యుల ముందు చర్చ పెట్టి ఆమోద ముద్ర పొందాల్సి ఉంటుంది. మార్పులు, చేర్పుల అనంతరం ఫిబ్రవరి 20లోపు అంచనాలను మంజూరు చేయాల్సి ఉంటుందని చట్టం చెబుతున్నది. మార్చి 1లోపు కార్పొరేషన్ బడ్జెట్ అంచనాల సమాచారాన్ని ప్రభుత్వానికి తెలియజేయాల్సి ఉంటుంది. కానీ, క్షేత్రస్థాయిలో పరిస్థితులు విరుద్ధంగా కనబడుతున్నాయి. నిర్ణీత సమయంలో బడ్జెట్ ప్రక్రియను ముగిస్తారా? లేదంటే మార్పులు, చేర్పులతో ప్రభుత్వానికి సకాలంలో పంపించక కాలాయాపన చేస్తారా? అన్నది వేచి చూడాలి.*

## అంబేద్కర్ నేటి తరానికి ఆదర్శప్రాయం



ఖుదావంద్‌పూర్‌లో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి/దోమ/కులకచర్ల డిసెంబర్ 8 : అంబేద్కర్ ఆలోచనా విధానం నేటి తరానికి ఆదర్శప్రాయమని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పరిగి మండలం ఖుదావంద్‌పూర్ గ్రామంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. అలాగే ఈనెల 14 న పరిగిలో నిర్వహించే తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా 5వ మహాసభ పోస్టర్లను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు. కాగా దోమ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆది వారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం 9.30 గంటలకు ఎమ్మెల్యే ఆసుపత్రికి వెళ్లగా సిబ్బంది ఎవరు లేకపోవడంతో జిల్లా వైద్యాధికారికి ఎమ్మెల్యే ఫోన్ చేసి సిబ్బంది ఎవరు అందుబాటులో లేకపోవడం ఏమి టని ప్రశ్నించారు. ఎవరో ఒకరు వచ్చినంత వరకు అంతకు ముందు విధులు నిర్వర్తించిన వారు ఉండాలి కదా అని అన్నారు. ఇన్‌చార్జి, అటెండర్, నర్సులు సైతం ఎవరు లేకపోవడం ఏమిటని, విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డీఎం అండ్‌హెచ్‌వోను ఎమ్మెల్యే ఆదేశించారు. కులకచర్ల మండల పరిధిలోని ఎర్రగోవింద్‌తండాలో ఆదివారం నిర్వహించిన విగ్రహాల ప్రతిష్టాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. ఎర్రగోవింద్‌తండాలో ఆంజనేయస్వామి, కాళికాదేవి అమ్మవారి విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం మాజీ ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, గ్రామ పెద్దల ఆధర్యంలో కొనసాగింది.

## రచయితలకు ప్రగతిశీల దృక్పథం అవసరం




సమావేశంలో మాట్లాడుతున్న సాహితీవేత్త నందిని సిధారెడ్డి

రవీంద్రభారతి, డిసెంబర్ 8: తెలంగాణ రచయితల సంఘం పదేండ్ల సాహిత్య సభలు ఆదివారం రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో నిర్వహించారు. తెరసం అధ్యక్షుడు డా.నాళేశ్వరం శంకరం అధ్యక్షత వహించగా, ప్రధాన కార్యదర్శి డాక్టర్ వి.శంకర్ పదేండ్ల నివేదికను సమర్పించారు. వక్తలుగా కవి నిఖిలేశ్వర్, కవి డా. నందినీ సిధారెడ్డి పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా నిఖిలేశ్వర్ మాట్లాడుతూ, తెలంగాణ రచయితలకు ప్రగతిశీల దృక్పథం అవసరమన్నారు. నందిని సిధారెడ్డి మాట్లాడుతూ.. కాకతీయ తోరణం, బతుకమ్మ, చార్మినార్ మొదలైన వాటిని తొలగించుటను రచయితలుగా ఖండించాలి. విద్వేష సంస్కృతిని వ్యతిరేకించాలన్నారు. తెలంగాణలోని బహుళ, సామరస్య, సంస్కృతి పెంపొందించడానికి కృషి చేయాలన్నారు. తెలంగాణ భాష, జీవితం, సంస్కృతిని మార్కెట్ సరుకుగా మారుస్తున్న ధోరణి ఖండించాలని తెలిపారు. తెలంగాణ అస్తిత్వంపై ప్రొఫెసర్ పి.కాశీం మాట్లాడుతూ, తెలంగాణ అస్తిత్వ సాహిత్య, వర్తమాన భవిష్యత్ సాహిత్యం గురించి ఆయన మాట్లాడారు. అనంతరం, కవి సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ బాణాల భుజంగరెడ్డి, దాశరాజు రామారావు, మోత్కూర్ అశోక్ కుమార్ పాల్గొన్నారు.

## పేకాట శిబిరంపై దాడి.. 13 మంది అరెస్ట్

బంజారాహిల్స్, డిసెంబర్ 8: ఓ అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్‌ను అద్దెకు తీసుకుని పేకాట శిబిరం నిర్వహిస్తున్న నిర్వాహకుడితో సహ 13మంది పేకాటరాయుళ్లను బంజారాహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్ నం.4లోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్‌ను అద్దెకు తీసుకుని పేకాట శిబిరం నిర్వహిస్తున్నారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు శనివారం రాత్రి ఆ ఫ్లాట్‌పై దాడి చేసి.. నిర్వాహకుడు సాయిరామ్‌తో పాటు పేకాడుతున్న మాతంగి నాగేశ్, మహ్మద్ ఫారూఖ్ హైదర్, కామిరెడ్డి వాసుబాబు, సయ్యద్ అహ్మద్, ముతమ్ అజయ్, కె.నర్సింహారెడ్డి, ఎన్.శ్రీనివాస్‌గౌడ్, ఎం.సంపత్‌కుమార్, ఆర్.భాస్కర్, కామిరెడ్డి వెంకటేశ్వర్లు, కె.నాగబాబు, ఎ.మార్కండేయులులను అరెస్ట్ చేశారు. వారి వద్దనుంచి రూ.1,00,580 నగదుతో పాటు 9 మొబైల్స్ ఫోన్లు, పేకాట కార్డులు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై గేమింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## రేషన్ బియ్యం తరలింపు.. ఇద్దరు అరెస్ట్

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబర్ 8: ద్విచక్రవాహనాలపై రేషన్ బియ్యంను తరలిస్తూ.. డంప్ చేస్తున్న ఇద్దరిని ఘట్‌కేసర్ పోలీసులు అరెస్ట్ చేసి, బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై నర్సింహా తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ పట్టణంలో యాదాద్రి జిల్లా తుర్కపల్లికి చెందిన ధరావత్ రాంజీ, ధరావత్ నందన్‌లు రేషన్ బియ్యం సేకరించి.. తరలిస్తున్నారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు వారిద్దరిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో పట్టణంలో సేకరించిన రేషన్ బియ్యాన్ని కుమ్మరి బస్తీలోని ఓ ఇంట్లో డంప్ చేసి .. ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు తెలిపారు. వారి నుంచి 8 క్వింటాళ్ల రేషన్ బియ్యంను స్వాధీనం చేసుకున్నారు.

## సింగపూర్‌లో ఉద్యోగాలంటూ చీటింగ్

### కన్సల్టెన్సీ నిర్వాహకుడితోపాటు మరో మహిళ అరెస్ట్




సిటీబ్యూరో, డిసెంబర్ 8 (నమస్తే తెలంగాణ): సింగపూర్‌లో ఉద్యోగాలు, వీసాలు ఇప్పిస్తామంటూ నమ్మిస్తూ మోసాలకు పాల్పడుతున్న ఇద్దరిని నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. డీసీపీ సుధీంద్ర కథనం ప్రకారం.. ఆసిఫ్‌నగర్‌కు చెందిన ఏరువ అభిషేక్‌రెడ్డి గతంలో సింగపూర్‌కు జాబ్ వీసాపై వెళ్లి వచ్చాడు. అదే అనుభవంతో హిమాయత్‌నగర్‌లోని కుబేరా టవర్‌లో జేఎంజేరెడ్డి పేరుతో జాబ్ కన్సల్టెన్సీ ప్రారంభించాడు. ఇతనికి కరీంనగర్‌కు చెందిన తుమ్మ చిన్నమ్మ అనే మహిళ సహకారం అందిస్తోంది. విదేశాల్లో ఉద్యోగాలు కావాలనుకునే వారిని ఆకర్షిస్తూ సింగపూర్‌లో మంచి ఉద్యోగాలిప్పిస్తామని, వీసా, ప్లేస్‌మెంట్ మొత్తం చేయిస్తామంటూ నమ్మిస్తారు. వీరి మాటలు నమ్మి సుమారు 25 మంది వరకు వారిని సంప్రదించగా, నుంచి రూ. 83 లక్షల వరకు వసూలు చేశారు. డబ్బులు వసూలు చేసిన తరువాత కన్సల్టెన్సీలో ఉండకుండా, ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకుండా దాటవేత ధోరణిని ప్రదర్శిస్తూ తప్పించుకు తిరుగుతూ తమ కార్యాలయాన్ని అల్వాల్‌కు మార్చారు. బాధితులు నారాయణగూడ, అల్వాల్ పోలీస్‌స్టేషన్‌లలోనూ ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి ఇద్దరు నిందితులు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సైదులు బృందం రంగంలోకి దిగి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి, కారును స్వాధీనం చేసుకున్నారు.

## సరదా కోసమే బైక్‌లకు నిప్పు

### మలక్‌పేట మెట్రో కింద వాహనాలను తగులబెట్టిన నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ రాజు

మలక్‌పేట, డిసెంబర్ 8: మలక్‌పేట మెట్రో స్టేషన్ కింద బైక్‌లు తగులబెట్టిన నిందితుడిని ఆదివారం చాదర్‌ఘాట్ పోలీసులు అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలను ఇన్‌స్పెక్టర్ రాజు వెల్లడించారు. ముంబై నగరం, మదీనా మసీదు ఈస్ట్ జోగేశ్వరీ ప్రాంతానికి చెందిన జాకీర్ మహ్మద్ అలియాస్ ఫాంటా(32).. 8 సంవత్సరాల క్రితం నగరానికి వచ్చి చాదర్‌ఘాట్‌లో కూలీపనులు చేసుకుంటూ మలక్‌పేట మెట్రో స్టేషన్‌వద్ద ఫుట్‌పాత్‌పై పడుకుంటున్నాడు. మద్యానికి, దురాలవాట్లకు అలవాటు పడి.. సరదా కోసం వాహనాలను తగులబెట్టి సంతృప్తిని పొందుతాడు. అందులో భాగంగానే ఈ నెల 6న మలక్‌పేట మెట్రో స్టేషన్ మెట్లకింద పార్కుచేసిన ఐదు ద్విచక్ర వాహనాలకు నిప్పంటించాడు. ఘటనానంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు, మెట్రో స్టేషన్‌వద్ద సీసీ ఫుటేజీలను పరిశీలించి నిందితుడిని గుర్తించారు. నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ సహాయంతో పోలీసులు ఆదివారం ఉదయం అక్బర్‌బాగ్ ఎక్స్ రోడ్‌వద్ద నిందితుడు జాకీర్ మహ్మద్‌ను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నేరాన్ని ఒప్పుకోవడంతో అతడిని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా.. నిందితుడు గతంలో కూడా డబీర్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇలాగే వాహనాలను తగులబెట్టినాడని పోలీసులు తెలిపారు.




యాలాల, డిసెంబర్8: సమానత్వమే సనాతన ధర్మం అన్న సూక్తిని మనసా వాచా కర్మణా పాటిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలువాలావలనే సదుద్దేశ్యంతో శ్రీ మానికేశ మహా సంస్థాన పీఠాధిపతి, తెలంగాణ సాధు పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పరమపూజ్య శంకర స్వామీజీ ఆధ్వర్యంలో తాండూరు పట్టణం తులసీ గార్డెన్‌లో సువాసినులకు పాదపూజ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి

బషీరాబాద్, డిసెంబర్ 8 : గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన బషీరాబాద్-తాండూరు రోడ్డు మార్గంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం...బషీరాబాద్-కొర్విచేడ్ గ్రామాల మధ్య ఉన్న ఓ ఫక్షన్ హాల్ లోపల నుంచి బషీరాబాద్ గ్రామానికి చెందిన కునల్ సింగ్(30) రోడ్డు పైకి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో యువకుడు మృతి చెందినట్లు తెలిసింది. రోడ్డు మార్గం గుండా వెళ్లే వాహనదారులు, ఫంక్షన్ హాల్‌లో పని చేసే కూలీలు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు పేర్కొన్నారు. అయితే పదో తరగతికి చెందిన విద్యార్థులు గెట్ టుగెదర్ ఫంక్షన్ చేసుకున్నట్లు తెలిసింది. వారితో పాటే కునల్ సింగ్ వచ్చినట్లు కూలీలు తెలిపారు. అయితే వివరాల కోసం పోలీసులను సంప్రదించగా వెల్లడించలేదు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు

కందుకూరు, డిసెంబర్ 8 : 20 సంవత్సరాల అనంతరం పూర్వ విద్యార్థులు ఒకే చోట కలుసుకున్నారు. మండల పరిధిలోని ఆకులమైలారంలో గల జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2005 వ సంవత్సరంలో చదువుకున్న విద్యార్థులందరూ ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. గుమ్మడవెల్లి, గుమ్మడవెల్లి తండా, మాలాగూడ, ఆకులమైలారం గ్రామాలకు చెందిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. రోజంతా సంతోషంగా గడిపారు. తీపి జ్ఞాకాలను గుర్తు చేసుకున్నారు. ఒకే చోట సహపంక్తి భోజనాలు చేశారు.

## ధూల్‌పేటలో ఆబ్కారీ దాడులు

### వేర్వేరు చోట్ల ఇద్దరు అరెస్ట్ 3.342కిలోల గంజాయి స్వాధీనం

సిటీబ్యూరో, డిసెంబర్ 8 (నమస్తే తెలంగాణ): గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న ధూల్‌పేటలోని పలు ప్రాంతాల్లో ఆబ్కారీ ఎస్టీఎఫ్ అధికారులు దాడులు జరిపారు. ఈ దాడుల్లో ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి 3.342కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఎస్టీఎఫ్ ఈఎస్ అంజిరెడ్డి కథనం ప్రకారం...ధూల్‌పేటకు చెందిన రాజాసింగ్, అల్జీపూర్‌కు చెందిన రాహుల్‌సింగ్ తమ నివాసాల్లో గంజాయి విక్రయాలకు పాల్పడుతున్నారు. ఈ మేరకు సమాచారం అందుకున్న ఎస్టీఎఫ్ పోలీసులు ఆదివారం ఏక కాలంలో రాజాసింగ్, రాహుల్‌సింగ్‌ల నివాసాలపై దాడులు జరిపారు. ఈ దాడుల్లో రాజాసింగ్‌ను అరెస్టు చేసి, అతడి వద్ద నుంచి 1.234కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. రాహుల్ సింగ్‌ను అరెస్ట్ చేసి అతడి వద్ద నుంచి 2.1కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు

## అధ్వానంగా బైరాగిగూడ- లేమూరు రోడ్డు



గుంతల మయంగా ఉన్న రోడ్డు

కందుకూరు, డిసెంబర్ 8 : బైరాగిగూడ నుంచి లేమూరు వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. దాదాపుగా రెండు కిలో మీటర్ల వరకు గుంతల మయంగా మారడంతో నిత్యం ప్రజలు అవస్థలు పడుతున్నారు. అసలే ఇరుకైనా రోడ్డు పైగా అధ్వానంగా తయారు కావడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. రోడ్డు విషయంలో ఎవరు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు విస్తరణతో పాటు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. లేమూరు గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామం బైరాగిగూడ కావడంతో లేమూరు గ్రామానికి వెళ్లాల్సివస్తుందని అంటున్నారు. లేమూరు గ్రామానికి వాహనాలపై వెళ్తున్నప్పుడు కానీ నడకదారిన వెళ్తున్నప్పుడు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని పోవాల్సి వస్తుందని పలువురు తెలిపారు. బీఆర్‌ఎస్ హయాంలో మరమ్మతుల కోసం మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి నిధులను మంజూరు చేసిందని బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాకపోవడంతో నిధులు నిలిచిపోయాయని తెలిపారు. కాగా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రభుత్వం తక్షణమే నిధులను మంజూరు చేసి బీటీ రోడ్డును నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

**నిధులు మంజూరు చేయాలి**



బైరాగిగూడ, లేమూరు రోడ్డు మరమ్మతులు చేపట్టాలి. రోడ్డు పూర్తిగా గుంతల మయంగా మారింది. రోడ్డు వెంట వెళ్లడానికి ప్రజలు జంకుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి. రోడ్డు నిర్మాణం సమయంలో కాంట్రాక్టర్ నాసిరకంగా చేపట్టారు. తాము తరచుగా లేమూరు గ్రామానికి వెలుతుంటాం. ఆ సమయంలో రోడ్డు చిన్నగా ఉండటం, అధ్వానంగా రోడ్డు తయారు కావడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి

-ఎండీ దావూద్, బైరాగిగూడ

## దగాపడ్డ కళాకారుల డప్పుల మోత

### 12న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కార్యక్రమం




ఎన్‌ఎస్‌ఎస్‌లో వాల్ పోస్టర్ ఆవిష్కరణ చేస్తున్న కళాకారులు

హిమాయత్‌నగర్, డిసెంబర్ 8: రాష్ట్రంలో అర్హులైన కళాకారులను గుర్తించి సాంస్కృతిక సారథిలో ఉద్యోగాలు కల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 12న బాగ్ లింగంపల్లిలోని 'దగాపడ్డ కళాకారుల డప్పుల మోత' ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఉద్యమ కళాకారులు తెలిపారు. గాయకుడు నేర్నాల కిషోర్ నేతృత్వంలో 32 గంటల పాటు జరిగే పాటల కార్యక్రమానికి కళాకారులు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్ ఆవిష్కరణ హైదర్‌గూడలోని ఎన్‌ఎస్‌ఎస్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా కళాకారులు సాయన్న, భూంపల్లి అశోక్, గౌర యాకన్న, మౌనిక, సంపత్, రవి, రాజశ్రీ, మహేశ్, శ్రీరామ్, కల్యాణి మాట్లాడుతూ, తాము ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లేందుకే ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, సీతక్కలను ఆహ్వానించామని చెప్పారు.



బడంగ్‌పేట, డిసెంబర్8: బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్ ఎస్వీ ఆర్ గార్డెన్‌లో అయ్యప్ప గురు స్వామి కళ్లెం ఎల్లారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అయ్యప్ప మహాపడి పూజ కార్యక్రమంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు వంగేటి ప్రభాకర్ రెడ్డి, చిగిరింత పెద్ద నర్సింహారెడ్డి, గుండోజ్ రఘునందన్ చారి, శ్రీనివాస్ రెడ్డి, రామిడి రాంరెడ్డి, ఏనుగు రాంరెడ్డి, సంరెడ్డి వెంకట్ రెడ్డి, సిద్ధాల బీరప్ప, గిరీశ్, వెంకట్ రెడ్డి, బొర్ర మాదవ రెడ్డి తదితరులు ఉన్నారు.

## విద్యాభారతి అఖిల భారత సమావేశాలు



సిటీబ్యూరో, డిసెంబర్ 8 (నమస్తే తెలంగాణ ) : విద్యా భారతి అఖిల భారతీయ శిక్షా సంస్థాన్ ఆధ్వర్యంలో నగరంలోని బండ్లగూడ జాగీరులోని శారదా ధామంలో శనివారం అఖిల భారతీయ సమావేశాలు జరిగాయి. ప్రచార విభాగం, అఖిలేఖాగార్ (డాక్యుమెంటేషన్) విభాగాల నుంచి దాదాపుగా దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి ప్రతినిధులు విచ్చేశారు. గత ఏడాది కాలంలో నిర్వహించిన కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ చామర్తి ఉమామహేశ్వర రావు, కార్యదర్శి ఆయాచితుల లక్ష్మణరావు అతిథులుగా విచ్చేశారు. కుటుంబ ప్రబోధన, పర్యావరణం, సామాజిక, నాగరిక కర్తవ్య బోధ, స్వబోధ అనే ఐదు రకాల పంచ పరివర్తన మీద ప్రత్యేకంగా చర్చించారు.


నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★ **I, Nisar Ulla Bhig** S/o Khalilulla Bhig R/o. 17-142, indira Nagar, Kodangal-509338, Vikarabad Dist-TS, I have Change my name to **Nisar Ulla Baig** S/o. Khaleel Ulla Baig.

NT-VAMSHI

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.


## వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

చర్లపల్లి, డిసెంబర్ 8 : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. ఈ సంఘటన కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. జనగాం జిల్లా పాలకుర్తి మండలం, బొమ్మెర గ్రామానికి చెందిన దేవసాని శ్రీహరి కుటుంబ సభ్యులతో కలిసి వైష్ణవి ఎన్‌క్లేవ్ వాసవి శివనగర్‌కు వచ్చి నివాసముంటున్నాడు. ఇతని కుమారుడు దేవసాని రామకృష్ణ(31) ఉప్పల్‌లోని స్టాక్ మార్కెట్‌లో పనిచేస్తున్నాడు. ఈ నెల 7న తన స్నేహితుడికి సంబంధించిన ద్విచక్రవాహనం (టీఎస్08 హెచ్‌డీ 7968)పై బయటకు వెళ్లి తిరిగి వస్తుండగా కాప్రా కాల్ పబ్లిక్ స్కూల్ వద్ద అతివేగంగా దూసుకు వచ్చిన ప్యాగో ఆటో (టీఎస్08 యూసీ 1845) బైక్‌ను ఢీకొట్టడంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు, వాహనదారులు అతడిని మెరుగైన చికిత్స కోసం ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. తలకు బలమైన గాయాలు కావడంతో వైద్యశాలలో చికిత్స పొందుతూ రామకృష్ణ మృతి చెందాడు. దీంతో పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

**మరో ఘటనలో ..**

కాప్రా డివిజన్, సాయిబాబా ఆఫీసర్స్ కాలనీలో నివాసముండే నవనీతన్(48) ప్రైవేట్ ఉద్యోగి. ఆదివారం నవనీతన్.. బైక్(టీఎస్10 ఈయూ 6355)పై వస్తుండగా కాప్రా, నేతాజీనగర్ వద్ద అదుపు తప్పి కిందపడి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వాహనదారులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి అతడిని పరిశీలించగా మృతి చెంది ఉన్నాడు. ఈ మేరకు కుషాయిగూడ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

Telangana Today

FOR LOCAL TO GLOBAL NEWS

పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు, వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు మరియు ఇతర ప్రకటనల కొరకు

ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.

ప్రకటనల విభాగం సెల్: 80966 77655

వికారాబాద్/పరిగి/ శంకర్‌పల్లి, తాండూర్/కొడంగల్ } 80966 77668

ఇబ్రహీంపట్నం/మహేశ్వరం : 80966 77962